క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా యాదవ సేవా సంఘం వారు వ్యవహరించారు. ఉదయం ఆకు పూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం స్వామికి పల్లకిసేవ గావించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వేసవి శిబిరంతో చిన్నారులకు మేలు



వేసిన బొమ్మలను ప్రదర్శిస్తున్న చిన్నారులు


కొడవలూరు: వేసవి శిబిరంలో ఇచ్చే శిక్షణ ద్వారా చిన్నారులకు ఎంతో మేలు జరుగుతుందని కొడవలూరు లైబ్రేరియన్ కె.రాజేశ్వరి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం చిన్నారులతో చిత్రలేఖనం వేయించడం, నీతి కథలు చెప్పించడం, డిక్టేషన్ రాయించడం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ క్రమం తప్పకుండా ఏదో ఒక అంశంలో శిక్షణ ఇస్తామని, వీటిని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మనుబోలు : గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మనుబోలు–పొదలకూరు రహదారిపై రైస్‌మిల్లు వద్ద సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కోట మండలానికి చెందిన ఆవుల ముత్యాలయ్య(37) గత నాలుగు రోజులుగా బండేపల్లి గ్రామంలోని తన సోదరి పోలమ్మ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో పిడూరు గ్రామంలో ఉన్న మరో సోదరి వద్దకు వెళ్లేందుకు సోమవారం రాత్రి రోడ్డు మార్గంలో నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీర తెచ్చిన తంటా..

- ఈదురుగాలులతో విద్యుత్ లైన్‌పై పడిన వైనం
- ట్రిప్పైన ఎన్టీఎస్ ఫీడర్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో మంగళవారం మధ్యాహ్నం వీచిన భారీ ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలో 11 కేవీ విద్యుత్ లైన్లపై చీర పడటంతో ఎన్టీఎస్ ఫీడర్ ట్రిప్పై సరఫరా నిలిచిపోయింది. నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లపై చెట్లు విరిగిపడ్డాయి. నెల్లూరు టౌన్ – 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి సిబ్బందిని అప్రమత్తం చేసి సరఫరాను పునరుద్ధరించారు.

వెంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిర 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రెజ్లర్లకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ నేత యశోధర పేర్కొన్నారు. రెజ్లర్లకు సంఘీభావంగా గాంధీబొమ్మ సెంటర్ వద్ద మంగళవారం చేపట్టిన నిరసన దీక్షలో ఆమె మాట్లాడారు. రెజ్లర్లపై వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై చర్యలు చేపట్టాలని కోరారు. పార్టీ నేతలు శేషారెడ్డి, రఘురామ్ ముదిరాజ్, నేతలు సాయిరామ్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జనరంజక పాలనకు నాలుగేళ్లు

- వాడవాడలా వైఎస్సార్‌సీపీ నేతల సంబరాలు



వెంకటాచలం మండల కేంద్రంలో కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మనుబోలు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో జనరంజక పాలన మొదలై నాలుగేళ్లు పూర్తయిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని మనుబోలు సచివాలయం–2లో వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని, దీంతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, గిద్దంటి రమణయ్య, ఏలూరు భాస్కర్‌రెడ్డి, ముంగర రవీంధర్‌రెడ్డి, సూరపనేని కిశోర్‌నాయుడు, కె.మణి, సి.నవకోటి, డి.సుధాకర్‌రెడ్డి, కె.కోటేశ్వరగౌడ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా మన పాలన

బుచ్చిరెడ్డిపాళెం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు మంగళవారం భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్రంలో నాలుగేళ్ల క్రితం ఏర్పాటైన జనరంజక పాలన ఐదో సంవత్సరంలో అడుగుపెట్టిందని నాయకులు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, నేతలు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, మోర్ల మురళీ, కోడూరు మధుసూదన్‌రెడ్డి, అల్లాభక్షు, విల్సన్, ప్రవళ్లి, వైస్ చైర్మన్ షాహుల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా పాలన

వెంకటాచలం : అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య అన్నారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నేతలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గతంలో ఎవరూ చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అడపాల ఏడుకొండలు, చీకుర్తి నరసయ్య, కడివేటి శివ, కందుకూరు సుబ్బారాయుడు, మందా కృష్ణ, హుస్సేన్ పాల్గొన్నారు.



మనుబోలు : కేక్ కట్ చేస్తున్న పార్టీ నేతలు



కోవూరు మండల కేంద్రంలో..

భారీ విజయం తథ్యం

ముత్తుకూరు : రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ భారీ విజయం నమోదు చేయడం తథ్యమని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ముత్తుకూరులోని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మంగళవారం పూలమాల వేశారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నడవడి ముత్యంగౌడ్, సర్పంచ్ రాజారామరెడ్డి, నేతలు లక్ష్మణరెడ్డి, విజయగోపాలరెడ్డి, కోటారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాలుగేళ్ల పాలన సువర్ణ యుగం

తోటపల్లిగూడూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన ఓ సువర్ణ యుగమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలో పార్టీ కార్యకర్తలు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ క్రమంలో నరుకూరు సెంటర్‌లో పార్టీ నేతలు కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, ఈ పాలనకు ప్రజలు మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు తలమంచి సురేంద్రబాబు, మధు, శ్రీనివాసులగౌడ్, చిట్టిబాబు, పరంధామయ్య, కిశోర్, మణి, పవన్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన

కోవూరు : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్లనే సంక్షేమ పాలన సాధ్యమని డీఏఏబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి అన్నారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు మంగళవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విప్లవాత్మక మార్పులను మన రాష్ట్రంలో అమలు చేశారని తెలిపారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు ఆయన్ను నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, ఎంఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీకుమారి, సచివాలయ మండల కన్వీనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: కేక్ కట్ చేస్తున్న బుచ్చి చైర్‌పర్సన్, నేతలు



తోటపల్లిగూడూరు : నరుకూరు సెంటర్‌లో..



ముత్తుకూరు మండల కేంద్రంలో..

గాలివాన బీభత్సం

- రోడ్ల వెంబడి కూలిన చెట్లు
- ఒరిగిన విద్యుత్ స్తంభాలు

పొదలకూరు : మండల పరిధిలో మంగళవారం గాలివాన బీభత్సవం సృష్టించింది. దీనివల్ల నిమ్మ, మామిడి రైతులు తీవ్రంగా నష్టపోగా పలు గ్రామాల్లో రోడ్ల వెంబడి చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు ఒరిగి తీగలు తెగిపోయాయి. దీంతో పొదలకూరుతో సహా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పట్టణంలో మెయిన్‌రోడ్లపై వర్షపునీరు పారింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం వల్ల జనాలు భీతిల్లారు. గాలి ఉధృతికి నిమ్మచెట్లు నేలకు ఒరిగాయని, మామిడి కాయలు నేలరాలినట్లు రైతులు వెల్లడించారు. అయితే వేసవి తాపం, ఉక్కపోతతో బాధపడుతున్న జనాలకు ఊరట లభించింది.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వీచాయి. మామిడి, నిమ్మ కాయలు రాలిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. పలుచోట్ల చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ధ్వంసమయ్యాయి. దీనివల్ల మూడు గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు దెబ్బతినడంతో విద్యుత్ శాఖకు రూ.12 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్‌రెడ్డి తెలిపారు.



మనుబోలు : నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్



పట్టణంలోని మారుతీనగర్లో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు



పొదలకూరులో కురుస్తున్న వర్షం

పులివాహనంపై చాముండేశ్వరీదేవి



పులివాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం చాముండేశ్వరీదేవి అమ్మవారు మంగళవారం పులివాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉభయదాతలుగా స్థానికులు మూలగల ప్రదీప్–మాధవీ, పుల్లా విశ్వేశ్వర్‌రెడ్డి– మంజుల దంపతులు వ్యవహరించారు. ఉదయం జరిగిన చప్పర ఉత్సవానికి కొండూరు సురారెడ్డి, పద్మావతి దంపతులు వ్యవహరించారు. అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహారావు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీనివాసులు అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి నేపథ్యంలో గ్రామాల్లోని ప్రజలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగొద్దని దండోరా వేయించాలని పేర్కొన్నారు. అలాగే తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎప్పటికప్పుడు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పెనుబల్లి ఎంపీటీసీ సభ్యుడు వినయ్ నారాయణ సమావేశంలో పలు సమస్యలను తీసుకురాగా వాటిని పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్యామ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి, పక్కన డ్వామా పీడీ

పొదలకూరు : మండలంలోని పులికల్లు గ్రామానికి చెందిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి(34) గుండెపోటుతో మంగళవారం మృతిచెందారు. విధి నిర్వహణలో భాగంగా ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలకు మస్టర్ వేసే సమయంలో చాతిలో నొప్పిగా ఉందని ఇంటికి వచ్చారు. విశ్రాంతి తీసుకుంటుండగా కుప్పకూలి మృతిచెందాడు. చంద్రశేఖర్‌కు భార్య, ఒక పాప ఉన్నారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పులికల్లుకు చేరుకుని నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని పేర్కొన్నారు. డ్వామా పీడీ డి.వెంకటరావు కూడా ఫీల్డ్‌అసిస్టెంట్ మృతికి తీవ్ర విచారం వ్యక్తం చేసి నివాళులర్పించారు. నేతలు నాయకులు వై.పెంచలరెడ్డి, జి.నారాయణరెడ్డి, కె.జనార్ధన్‌రెడ్డి ఉన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన కామేశ్వరరావు

పొదలకూరు : పట్టణంలోని నెల్లూరు రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామమందిరం వీధికి చెందిన ఆకులూరు కామేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై కరిముల్లా కథనం మేరకు.. నెల్లూరు రోడ్డులో అమ్మ వాటర్ ప్లాంట్ వద్ద నుంచి కామేశ్వరరావు తన బైక్‌లో వస్తుండగా పల్సర్‌బైక్‌పై అతివేగంగా వెళ్తున్న యువకుడు ఢీకొన్నాడు. దీంతో కామేశ్వరరావుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న భార్య సుజాతలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకుని బంధువుల సాయంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించి అక్కడి నుంచి నెల్లూరుకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని విజయ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలపై పోరాడేది సీఐటీయూనే



మాట్లాడుతున్న నర్సింగరావు

ముత్తుకూరు : దేశంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేసే పెద్ద సంఘం సీఐటీయూ మాత్రమే అని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి నర్సింగరావు అన్నారు. మండలంలోని బ్రహ్మదేవిలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఏఈ రామ్‌ప్రసాద్‌రెడ్డితో కలిసి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు. గ్రూప్–2 జేఎల్ఎంలు ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని, వారికి తగిన గుర్తింపునివ్వాలన్నారు. సీఐటీయూ నేత శ్రీనివాసులు, ఏపీఎస్పీడీసీఎల్ కార్యదర్శి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యకారిణికి ప్రశంసలు



సుస్మితను అభినందిస్తున్న నిర్వాహకులు

మనుబోలు : మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన కూచిపూడి నృత్యకారిణి కందల సుస్మిత తమిళనాడులోని తంజావూరు బృహదీశ్వరాలయం, చిదంబరంలోని నటరాజస్వామి ఆలయాల్లో ఈనెల 27, 28, 29వ తేదీల్లో నృత్య ప్రదర్శనలిచ్చింది. చిన్నారి నృత్యానికి ముగ్ధులైన నిర్వాహకులు చివరిరోజు ఆమెను ప్రశంసాపత్రంతో సత్కరించి అభినందనలు తెలిపారు. సుస్మిత ఇప్పటి వరకు 100కు పైగా ప్రదర్శనలిచ్చి పలు అవార్డులు రివార్డులు గెలుచుకుంది.


పదోన్నతిపై ఎంపీడీఓ బదిలీ

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీఓ(ఎఫ్ఏసీ)గా విధులు నిర్వహిస్తున్న నరసింహారావు మంగళవారం పదోన్నతిపై చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు నరసింహారావును సన్మానించారు.

హైస్కూల్ ప్లస్‌లో రేపట్నుంచి తరగతులు

కొడవలూరు: నార్తురాజుపాళెంలోని హైస్కూల్ ప్లస్(బాలికలు)లో గురువారం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభమవుతాయని హెచ్ఎం డి.ఓబులేసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది(2022–23) విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ బాలికల కోసం ఇంటర్మీడియట్ ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఇక్కడ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే బాలికలకు తగినన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

మొక్కల పెంపకం చేపట్టాలి



కృష్ణపట్నంలో మొక్కలు నాటుతున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ముత్తుకూరు : పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం చేపట్టాలని డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. 'వృక్ష సే వికాస్' నినాదంతో మంగళవారం మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం చేపట్టారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి, పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఫౌండేషన్ సీఎస్సార్ హెడ్ రాజేష్ రంజన్, ఆపరేషన్ హెడ్ మనీష్ దవే, ఈహెచ్ఎస్ హెడ్ వేణుగోపాలరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు



హోమంలో పాల్గొన్న దంపతులు

పొదలకూరు : మండలంలోని మరుపూరులో ఉన్న కామాక్షి సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పుణ్యహవచనం, జలాధివాసం, హోమాలను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు మంత్రి కాకాణి రాక

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మరుపూరులోని మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో బుధవారం ఉదయం 9 గంటలకు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహిస్తారని వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు.

వీరభద్రస్వామి ఆలయంలో వార్షిక వేడుక



పూజల్లో పాల్గొన్న భక్తులు

మనుబోలు : మండల కేంద్రంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో శత వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంతో పాటు పరిసరాలను విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణంలో దేవాతామూర్తుల ఆర్చిలను ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో భాగంగా అర్చకుడు శ్రీనివాసులు సోమవారం రాత్రి స్వామివారికి మహాగణపతి హోమం, గణపతి పూజ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, దేవీ ఖడ్గమాలార్చన తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. ఉభయకర్తలుగా భాగవతుల రాఘవేంద్ర, నాగేంద్ర–అనూరాధ దంపతులు వ్యవహరించారు.

వెంకన్నపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కొడవలూరు : మండలంలోని వెంకన్నపురంలో కొడవలూరు పీహెచ్‌సీ వైద్య బృందం వారు మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓపీ నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో క్షయ వ్యాధి బాధితుని ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. ఆ వ్యక్తి వ్యాధి నుంచి కోలుకొని మెరుగు పడినట్లు నిర్ధారించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గీతా సాహితి మాట్లాడుతూ గతంలో ఇక్కడికి వచ్చిన సమయంలో ఆ వ్యక్తికి వ్యాధి తీవ్రంగా ఉండేదని, వైద్య పరీక్షలు చేసి మందులు, ఆరోగ్య సలహాలు ఇచ్చినట్లు చెప్పారు. మందులు క్రమం తప్పకుండా వినియోగించడం వల్ల అతను త్వరగా కోలుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎస్ బి.పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ పి.శ్రీలత, హెచ్ఏలు షఫీఉద్దీన్, రమణమ్మ, ఆశా కార్యకర్త కె.కృష్ణకుమారి పాల్గొన్నారు.